అకాల వర్షం.. అపార నష్టం

- వరుస వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- నష్టపరిహారం అందించేందుకు శరవేగంగా ప్రభుత్వం చర్యలు
- క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరిస్తున్న అధికారులు
- త్వరలోనే పరిహారం అందేందుకు నివేదికలు


యార్లపూడి గ్రామంలో నేలకొరిగిన వరిపంట


రోడ్డుపై ఆరబెట్టిన తడిసిన ధాన్యం

శ్రీకాళహస్తి రూరల్: అకాల వర్షాలకు రైతన్నలు కుదేలయ్యారు. సాగు చేసిన వరి పంట చేతికొచ్చేదశలో నేలకొరిగిపోవడంతో తీరని నష్టం వాటిల్లింది. ముందస్తుగా ఒబ్బిళ్లు చేసిన ధాన్యం రంగు మారిపోయింది. వేరుశనగ విత్తిన నాలుగురోజులకే వరుస వర్షాలు పడడంతో వేసిన విత్తనం కుళ్లిపోయింది. దీంతో అన్నదాతలు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా పరిహారం అందించేందుకు శరవేగంగా నివేదికలు తెప్పించుకుంటోంది.

అన్నదాతలకు తీరని నష్టం..

ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. శ్రీకాళహస్తి మండలంలో రబీ సీజన్‌లో కింద 11,250 ఎకరాలు సాగుచేశారు. ఎన్నడూ లేనివిధంగా ఈసారి మార్చి నెలలో 17 నుంచి అకాల వర్షాలు కురిశాయి. 18న వడగండ్లతో కూడిన భారీ వర్షం పడడంతో రైతులు సాగుచేసిన వరి పంట నేలపాలైంది. ఎన్నడూ లేనివిధంగా రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిట్టుబాటు ధర 75 కేజీల బస్తాకు రూ.1,800 కల్పించింది. వరి ధాన్యానికి మంచి ధర ఉండడంతో రైతులు ఎంతో ఆనందంగా ఉన్న సమయంలో వర్షం వారి ఆశలను ఆవిరి చేసింది. పంట కూడా ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉండేది. పంట చేతికి అందే దశలో వరుణిడి దెబ్బకు పంట మొత్తం నేలకొరిగి పూర్తిగా తడిచిపోయింది. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పొలాల్లో నీరు నిల్వ చేరి నేలకొరిగిన వరి కంకులు నీళ్లలో తేలియాడుతున్నాయి. ఎకరాకు కనీసం 5 బస్తాలు కూడా కాని పరిస్థితి నెలకొంది. మరికొంతమంది రైతులు ఒబ్బిళ్లు చేసుకుని కల్లాల్లో, రహదారులపై ఆరబోయగా వర్షానికి ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. తడిసిన ధాన్యం రంగు మారుతుండడంతో ఆ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా వేరుశనగ పంట విత్తిన కొద్దిరోజులకే వర్షం రావడంతో సాగుచేసిన పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. అదేవిధంగా నిమ్మసాగు చేసిన రైతులు పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ ఏడాది నిమ్మ ఆశించిన రీతిలో దిగుబడి వచ్చింది. కొద్దిరోజుల్లో కోతకోసి మార్కెట్‌కు తరలించే సమయంలో వడగండ్ల వర్షానికి నిమ్మకాయలు నేలరాలాయి. దీంతో నిమ్మసాగు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పుచ్చసాగు సాగు చేసిన రైతులది మరో కన్నీటిగాథ. గత రెండేళ్లుగా అంతంత మాత్రంగానే ఉన్న మామిడి పంట ఈసారి ఫర్వాలేదు అనిపించింది. అయితే వర్షానికి చెట్లలోని పూత, పిందెలు, కాయలు మొత్తం రాలిపోయాయి. దీంతో మామిడి రైతులు పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు..

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వేగంగా స్పందించింది. వెంటనే పంటలు నష్టపోయిన రైతుల వివరాలను నివేదికలో రూపొందించాలని ఆదేశించింది. గతంలో కూడా వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఆగమేఘాల మీద స్పందించి పరిహారం అందించిన విషయం తెలిసిందే. ఈసారి కూడా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు శరవేగంగా చర్యలు చేపట్టడంతో అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ముక్కంటి సేవలో మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్


ఆలయ ధ్వజస్తంభం వద్ద వెంకటరెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వెంకటరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి, ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంజీఎం గ్రూప్ చైర్మన్, తిరుపతి జిల్లా స్టోన్ క్రషర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గుడ్లూరు మల్లికార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూరుపేట వద్ద గల నల్లగంగమ్మ ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారిని కామాక్షమ్మ దవనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ కంఠా రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుపై గొయ్యి పూడ్చివేత


గొయ్యిని పూడ్చుతున్న యువకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కేటీ రోడ్డు నుంచి కంచనపుత్తూరు గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుపై భారీ వర్షాల వల్ల పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందిపడేవారు. దీనిపై స్పందించిన గ్రామంలోని యువకులు రోడ్డుపై ఉన్న గొయ్యికి మట్టి తోలి పూడ్చివేశారు.

ఉగాది కానుకల పంపిణీ


రేణిగుంట: పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నగేశం

రేణిగుంట: రేణిగుంట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం సర్పంచ్ నగేషం, ఈఓ విజయభాస్కర్ ఉగాది కానుకలను పంపిణీ చేశారు. పంచాయతీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఉగాది పండుగ రోజున కూడా పారిశుద్ధ్య కార్మికులు సూర్యోదయానికి ముందే లేచి అన్ని వీధులను శుభ్రం చేయడంపై సర్పంచ్ కార్మికులను అభినందించారు. వారికి దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సంధ్య



బుచ్చినాయుడుకండ్రిగ: బీఎన్‌కండ్రిగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉగ్గుమూడి సంధ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం కోడలు. తనకు ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనేదానికి తానే ఉదాహరణ అని సంధ్య తెలిపారు.

ఆకట్టుకున్న ఉగాది ఆస్థానం


భక్తులను కటాక్షిస్తున్న అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరుడు

వడమాలపేట : అప్పలాయగుంటలోని టీటీడీకి అనుబంధంగా వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శోభకృత్ ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు పంచాంగం శ్రవణం చేస్తూ ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉభయ నాంచారులతో ప్రసన్నవేంకటేశ్వరుని విశేషంగా అలంకరింపజేసి మేళతాళాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తకన్నప్పకు సారె సమర్పణ


సారె తీసుకెళ్తున్న అంజూరు తారక శ్రీనివాసులు


భక్తకన్నప్పను దర్శించుకున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని తేరువీధిలో వెలసిన భక్తకన్నప్ప 43వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయం తరఫున సారె శాస్త్రోక్తంగా సమర్పించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ సారెను ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తకన్నప్ప ఆలయంలో సారెను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, బియ్యపు శ్రీవాణిరెడ్డి, బియ్యపు పవిత్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోపుర కుంభాభిషేకం


కుంభాభిషేకానికి గోపుర కలశాలను తీసుకెళుతున్న ఆలయ నిర్వాహకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో గల శ్రీసత్యసాయి బాబా మందిరంలో బుధవారం నూతన గోపురం, విమాన కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేకం కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం భక్తిశ్రద్ధలతో మండల ప్రవేశం, యాగశాల శుద్ధి, మహాపూర్ణాహుతి, సుప్రభాతం, నగర సంకీర్తన, శిఖర కలశాల ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినం రోజున జరిగిన సత్యసాయి మందిర మహాకుంభాభిషేకంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమన్నారు. అలాగే సత్యసాయి సేవాసమితి వారు ప్రతిరోజు పేదలకు అన్నదానం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సత్యసాయి సేవాసమితి సంస్థ సభ్యులు పాండురంగయ్య, అమరనాథ్, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ


తెలుగు సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బాలప్రసాద్ యాదవ్

ఏర్పేడు: మండలంలోని గ్రామాలన్నింటిలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని గ్రామస్తులు పంపిణీ చేశారు. గ్రామాల్లో మహిళలు ఇళ్ల వద్ద వివిధ రకాల రంగవల్లులు వేసి ఒకరినొకరు తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చింతలపాలెంలో సర్పంచ్ బాలప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రభోద సేవాసమితి హిందూ జ్ఞానవేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం


సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా సీతారాములకు కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పంచాంగానికి పూజలు చేసి రాశి ఫలాలను చదివి వినిపించారు. భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు.

కాంబాకం రోడ్డుకు మహర్దశ


గతంలో కాంబాకం రోడ్డు


కాంబాకం వెళ్లే రోడ్డు

- రూ.1.30 కోట్లతో రోడ్డు అభివృద్ధి
- గత ప్రభుత్వంలో ఆగిన పనులకు ప్రస్తుత ప్రభుత్వంలో మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు

వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం రోడ్డుకు ప్రస్తుత ప్రభుత్వంలో మహర్దశ కలిగింది. అటవీశాఖ అధికారుల అడ్డంకులతో గత ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అప్పటి సాధారణ ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఎమ్మెల్యే చొరవ తీసుకుని స్థానిక అటవీశాఖకు, ప్రభుత్వానికి మధ్య నెలకొన్న భూసమస్యను ఎట్టకేలకు పరిష్కరించి ఇటీవల రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించారు. వరదయ్యపాళెం నుంచి కాంబాకం వరకు 3 కి.మీ మేర రూ.1.30 కోట్లతో రోడ్డును అభివృద్ధి చేయడం జరిగింది. అయితే ఇప్పటివరకు మంజూరైన నిధులు రోడ్డు పూర్తి చేయడానికి చాలకపోవడంతో 400 మీటర్ల మేర బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి స్థానిక సర్పంచ్ దీప తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు ఐదేళ్లపాటు నిరీక్షణకు గురైన రోడ్డు నిర్మాణ పనులు స్థానిక ఎమ్మెల్యే చొరవతో పూర్తి అవుతుండడంపై కాంబాకం గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర రక్షణ శాఖ మంత్రి సలహాదారుడికి స్వాగతం


సతీష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట: కేంద్ర రక్షణ శాఖ మంత్రి సైంటిఫిక్ సలహాదారు జి.సతీష్‌రెడ్డికి బుధవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఏడాదికి సరిపడా నిత్యావసరాల వితరణ


మృతుడి కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: సిపాయి భరోసా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని దుర్గిపేరిలో ఇటీవల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ గాది చెంగారెడ్డి మృతి చెందాడు. ఈ విషయం తెలిసి చెంగారెడ్డి కర్మక్రియలకు హాజరైన ఆయన సిపాయి భరోసా పథకం కింద ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన మాట్లాడుతూ పేద కుటుంబంలో సంపాదనపరుడు మృతిచెందితే ఆ కుటుంబానికి సిపాయి ఫౌండేషన్ ద్వారా ఏడాదికి సరిపడా 40 రకాల నిత్యావసర సరకులను ఈ పథకం ద్వారా అందజేస్తున్నట్లు వివరించారు. అలాగే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు, గర్భిణులు, బాలింతల మృతి, సంపాదనపరుడు పక్షవాతంతో మంచాన పడి ఉన్న కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిరెడ్డి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, న్యాయవాది తిరుమలరెడ్డి, నాయకులు దశరథరామిరెడ్డి, మునిశేఖర్, కుమార్, మునిరెడ్డి, మునికృష్ణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పంచాంగ పఠనం




బుచ్చినాయుడుకండ్రిగ: ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..., బీఎన్‌కండ్రిగ: నీర్పాకోటలో చెంగాలమ్మ


నాగలాపురం: పెద్దశేష వాహనంపై వేదనారాయణుడు




నారాయణవనం: ఉగాది ఆస్థానంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, వీరరాఘవస్వామి ఆలయంలో..




నాగలాపురం: సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో పంచాంగ పఠనం, అన్నదాన ట్రస్టుకు విరాళం అందిస్తున్న దాతలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లెలో వెలసిన మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు ఉగాది పంచాగ పఠనం చేపట్టారు. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి నంది మండపంలో ఆసీనులు చేశారు. అనంతరం భక్తులు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు ఆనంద్, మునివేలు, ఎస్ఎం సురేష్, కవిత, సత్య సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకులు పంచాంగ పఠనం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం

శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని జిల్లా ట్రేడ్ యూనియన్ చైర్మన్ బీరేంద్ర వర్మ, తిరుపతికి చెందిన సాయిశ్రీయ, నగరికి చెందిన ఎంసీవీ రెడ్డి రూ.10,116 చొప్పున మొత్తం రూ.30,348లను శ్రీపళ్లికొండేశ్వరాలయ అనదానం ట్రస్టుకు విరాళంగా అందించారు. అన్నదాన ట్రస్టుకు అందించే విరాళాలకు 80జీ కింద పన్ను మినహాయింపు ఉంటుందని ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి తెలిపారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి, వినాయక దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పంచాంగాన్ని చదివి వినిపించారు. అనంతరం ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పల్లమాల గ్రామంలోని అభయ అంజనేయస్వామి , వేమలమ్మ, చెంగాళమ్మ, పచ్చాలమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వెంకన్న ఆలయంలో ఉగాది ఆస్థానం

నారాయణవనం: శోభకృత్ నామ సంవత్సరాదిని పురస్కరించుకుని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ఉగాది ఆస్థానం నిర్వహించారు. పంచాంగానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. రాశి ఫలాలను చదివి వినిపించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. ఉభయ నాంచారుల సమేత కల్యాణ వెంకన్నకు ఉగాది స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. సాయంత్రం శేష వాహనంపై ఉత్సవర్లను సుందరంగా అలంకరించి ఆస్థానం నిర్వహించారు. టీటీడీ తరఫున ఆలయ అధికారి నాగరాజు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆస్థానంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అక్షింతలను అందజేశారు. అలాగే స్థానిక వీరరాఘవ దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వేదనారాయణ స్వామి ఆలయంలో..

పిచ్చాటూరు: నాగలాపురం శ్రీవేదనారాయణ స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూలవర్లకు అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణస్వామిని పెద్ద శేష వాహనంపై ఆసీనులు చేసి ఆస్థానం నిర్వహించారు. అర్చకులు నాగరాజ భట్టాచార్యస్వామి పంచాంగ పఠనం చేశారు.